# నైతికషరాబు

అంగారకుడు

ఈమధ్యతలవని తలంపుగామాకుటుంబపు పాతస్నేహిడు ఒకాయన్ను కలుసుకున్నాను. పెదనందిపాడు పన్నుల నిరాకరణదగ్గరినుంచి ఈ నాటి వరకూ జాతీయోద్యమంలో ముందడుగు వేసినుంచున్న వ్యక్తి ఆయన.

కుశలప్రశ్నలయినతరవాత, ప్రస్తుతం ఏం చేస్తున్నావోయ్అని ఆయన అడిగాడు.

"విశ్వరూపంపత్రికలో విలేఖరిగా ఉంటున్నాను. అయితే మీరు ఇప్పుడువెక్కడ|ఉండటం?"అని తిరిగి ప్రశ్న వేశాను.

"మనవూళ్లోనే. కాంగ్రెస్ నైతిక షరాబుగా ఉంటున్నాను." అన్నాడాయన.

"ఇదేమిటండోయ్. ఈ పేరు ఎక్కడా వినలేదే" అన్నాను.

"పేరుమాత్రమే కొత్త అంతే. మామూలు షరాబు వెండి, బంగారాలకు ధరలు కట్టి చెలామణీ చేసినట్లే నేను నీతికీ, అవినీతికీ, ధర్మాధర్మాలకూ ధరలుకట్టి, ఏ విషయం ఏ తరగతికి చెందుతుందో నిర్ణయిస్తూ ఉంటాను."

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అసలు ఇటువంటి విషయాలన్నీ స్వార్థపరులు కల్పించిన వేననీ, ప్రజలకు మేలు చేయటమే అసలైన ధర్మమనీ చెప్పే వ్యక్తి ఈ రొంపిలో ఏట్లా దిగాడా అని ఆశ్చర్యం వేసింది.

ఆయన నా మొహంలో ఆశ్చర్యాన్ని కనిపెట్టి "అది కొంచం పెద్ద కథలే!" అన్నాడు.

"అయితే కాఫీ తీసుకుంటూ మాట్లాడదాం రండి."

"ఎబ్బెబ్బే! ఇప్పుడే తాగానోయ్."

"మరీ మంచిది. మనం వెళ్లే హోటలు కూర్చుని మాట్లాడటానికే ఉపయోగిస్తుంది గాని, తినటానికి రుచించే సరుకు ఉండదు." అని ఆ మహాహోటలుకి దారి తీశాను.

*   *   *   *

"మొత్తానికి చాలా తమాషాగానే ఉన్నది మీ సంగతి" అన్నాను.

"అవునోయ్. వింతగానే ఉన్నది. అయితే దానికి ఒక అర్థం అంటూ లేకపోలేదు."

"అ దేదో చెప్పమనే నా మనవి."

"దగ్గర డబ్బులేని సమయంలో పసిపిల్లవాడు అవీ, ఇవీ కొనిపెట్టమని అడుగుతాడనుకో. అప్పుడేం చేస్తావ్ ?"

"ఏవో మాయమాటలు చెప్పి మరిపించాలని చూస్తాను."

"సరిగ్గా అదేపని నేనూ చేస్తున్నాను. అధికారంలోకి వచ్చినతరవాత మేము అనుకున్నట్లు ఏదీ చేయలేకపోతున్నాము. జనం గోలపెట్టకుండా వాళ్లని ఏదో జోకొట్టాలంటావా లేదా ? అందుకోసం ఈ పనిచెయ్యాలి."

"అందుకని ?"

"అందుకని వాళ్ల దృష్టిని నిత్యవ్యవహారాలమీదనుంచి మళ్లించటానికి ఏదో ఒకటి చెప్పాలి. దానికి ధర్మపన్నాలు బాగా పనికొస్తయ్."

"ఆ ఒక్కపనికె అయితే ఆట్టే శ్రమ ఉండదేమో!"

"అదిఒకటే కాదు. వేరే ఇబ్బందికూడా ఉన్నది. అధికారం మన చేతిలోకి వచ్చినతరవాత అనేకమంది బోలెడు ఉద్యోగాల్లో ఇరికారు. అడపా, దడపా ఏవో ప్రకటనలు చేస్తుంటే కాని, పబ్లిక్ దృష్టిలో ఉండమేమోనన్న భయం వాళ్లకి పట్టుకున్నది. అందుకని అయినదానికీ, కానిదానికీ ఏదో నెపం పెట్టి ఏదో ప్రకటన చేస్తూఉంటారు."

"అవును. వాటిని ప్రకటించేవరకూ మా గొంతు కొరుకుతూ ఉంటారు."

"అంతే కాదు బ్రిటిష్ పరిపాలనలో డిపార్టుమెంట్ సెక్రటరీలు మాత్రం ఉండేవాళ్లు. ఇప్పుడు మంత్రులు, పనిలేని మంత్రులూ, డిప్యూటీమంత్రులు, స్టేట్ మంత్రులు- ఈ విధంగా సబ్ అసిస్టెంట్ జాయింట్ డిప్యూటీ స్టేట్ మంత్రివరకూ-"

"ఏమేమిటీ? సబ్ అసిస్టెంట్ —"

"నీ ఇష్టంవచ్చిన వరస పెట్టుకో- అటువంటివాళ్లంతా ఉన్నారు. ఒక్కొక్కళ్లకూ పార్లమెంటరీ సెక్రటరీ, ప్రైవేట్ శెక్రటరీ, పర్సనల్ ఎసిస్టెంట్ ఈ విధంగా ఎంతోమంది ఉన్నారు. ఇంకా రాష్ట్రపార్టీసంఘాలు, పోటీసంఘాలు వగైరా నాయకులు ఎంతోమంది ఉన్నారు. వీళ్లతో పనిఉన్నవాళ్లు ఏదో ఒకటి ఏర్పాటుచేసి కొంతమందిని అధ్యక్షులుగానూ, కొంతమందిని ప్రారంభకులుగానూ, కొంతమందిని జండా ఎగరెయ్యటానికీ, దిగలాగటానికి కొంతమందినీ పిలుస్తారు, మరి వీళ్లంతా ఏదో ఒకటి చెప్పాలిగదా?"

"తప్పనిసరిగా మాట్లాడా లంటారా?"

"ఇదుగో, కొంటెగా మాట్లాడబోకు, వీళ్లంతా ఈ గంభీరోపన్యాసాలు, ఉద్ఘాటనలు చెయ్యకపోతే మీ పేజీలు నింపటం కష్టమని నీకుమాత్రం తెలియదూ?"

నేను నవ్వి ఊరుకున్నాను.

"మరి ఇంతమంది హట్లాడాలంటే కొత్తవిషయాలు ఎక్కడినించి వొస్తయ్?"

"వెనక చేసిన పనులు, చెయ్యబోయే పనులు వివరించవచ్చునుగా !"

"అవన్నీ ఎప్పుడో పూర్తి అయినయ్. స్వరాజ్యంవచ్చేలోపలే వెనక చేసిన పన్లను చెప్పుకోటం పూర్తి అయింది. స్వరా[illegible] వొచ్చినతరవాత, తాము ఏ మేమి[illegible]య బోతున్నదీ చెప్పటం జరిగింది. కా[illegible] రోజులు గడుస్తున్నకొద్దీ, మాటలు చూస్తే గడపలు దాటుతయ్, చేతలు చూస్తే గడపలు దాటవు. అన్నట్లుతయూ రయింది."

"పోనీ, ఒక్కొక్కరూ ఒక్కొక్క విషయాన్ని తీసుకుని ప్రత్యేకంగా కృషి చెయ్యొచ్చునుగా ?"

"కొంతమంది అపనీ చేస్తున్నారు. ఒక నాయకుడు కళాసేవకుడై కళామయం జగత్ అంటుంటే మరొక ఘనాపాఠి సాహిత్యంమీద సవారీ చేస్తున్నాడు. ఒకాయన నాన్కోఆపరేషన్రోజుల్ని దాటలేకపోతే, మరొక ప్రముఖుడు కోఆపరేటివ్ వ్యవహారాలను ముక్కున పెట్టుకుని ఉంటాడు. ఒక హేమాహేమీ గడిచిన వైభవాన్ని స్పెషలయిజ్ చేస్తే మరొక ప్రబుద్ధుడు ప్రతిక్షణం రామరాజ్యస్మరణ చేస్తుంటాడు."

"అంతేకాని జరుగుతున్న చరిత్ర పట్టరంటారు"

"దానిని మరుగుపరచటమే అసలు ఉన్న సమస్య. ఈ స్పెషలిస్టుల ప్రసంగాలుకూడా జనానికి విసుకు పుట్టిస్తున్నవి. అందుకని అందరికీ అందుబాటులో ఉండే రెండు సంగతుల్ని కనిపెట్టాను."

"ఆహాఁ! ఎమిటి అవ్వి?"

"ఒకటి- వేదాంతం చెప్పటం; రెండు- అన్యాయం పెరిగిపోతున్న దనటం."

"ఇవిమాత్రం అంతా చెపుతుంటే విసుకు పుట్టదూ"

"అక్కడే ఉంది తమాషా! వేదాంతం చెప్పటానికి ఎన్నిమార్గాలున్నవో లెక్కపెట్టటం చాల కష్టం. ఒకాయన భగవద్గీతను వల్లిస్తూ ఒకరిమీద విజృంభిస్తాడు. ఇంకో

కాయన రామాయణపఠనంతో ప్రజల గుండెల్ని కరిగించటానికి ప్రయత్నిస్తాడు. మరొక మహానుభావుడు మహాభారతంలో నుంచి భారతరాజ్యాంగాన్ని ఎత్తి చూపటానికి తంటాలు పడతాడు. అడుగడుక్కీ మానవత్వం, అహింస, సత్యం, నిష్కామ కర్మ, త్యాగం, బలిదానం, అమరజీవి — ఈ పద్ధతిలో కోలాహలం గామాటల్ని గుప్పిస్తారు.

"ఆ తరవాత?"

"అధర్మం పెరిగిపోతున్నదనీ, ధర్మం నశించిపోతున్నదనీ గోలపెడతారు. నీతి అనేది నశించిపోతున్నదని అడావుడి చేస్తారు."

"అట్లా చేస్తేనే కాని, తాము నీతిపరులని జనం నమ్మరనుకుంటారేమో!"

"అసలు కిటుకు కనిపెట్టేశావ్!"

"అందులో వాళ్ల ఉద్దేశం వేరే ఏమయినా ఉన్నదా?"

"ఒక్కటే ఉద్దేశం. అధికారంలో ఉన్నవాడెవడయినా, ఎప్పుడూ ఒక్క విషయాన్ని కోరతాడు. తనని అధికారంలోకి ఎత్తిన పరిస్థితులు మారకూడదని అభిలాషపడతాడు. వాటిని మార్చే విషయాలన్నిటినీ నీతివిరుద్ధాలనీ, ధర్మవిరుద్ధాలనీ అంటాడు.

"మీ వాదనని బలపరిచి చూపాలి."

"అయితే విను. బ్రిటిష్ 'హూణ' ప్రభువులు పరిపాలిస్తుండగా మన ధర్మరక్షకులు కొందరు వాళ్లకి తలబగ్గి తాజీం ఇస్తుండేవాళ్లు. జాతినంతటినీ కూడగట్టటానికి గాంధీజీ హరిజనోద్యమం లేవదీస్తే, ఈ ధర్మరక్షకులు నానా గోలా చేసి, అసలు ఒకటే కాలుమీద నడుస్తున్న ధర్మాన్ని ఆయన నేలమీద పొర్లిస్తున్నాడన్నారు."

"అయినా ధర్మం మూడు, నాలుగు కాళ్లమీద నడవటం ఏమిటి?"

"అందులో ఆశ్చర్యం లేదు. తగిన ఏర్పాటు చేస్తే ఈ రోజునకూడా ధర్మాన్ని 34 కాళ్లమీద నడిపించవచ్చు."

"చండశాసనాలు చేసి నేరస్తుల ముక్కూ, కాళ్లూ తెగ్గోయిస్తేనా?"

"అబ్బె! అది మూర్ఖపద్ధతి. ధర్మాధర్మాల నిర్ణయం మనకి అనుకూలంగా మారిస్తే సరి."

"అది వివరంగా జరగాలి?"

"కృతయుగంలో ధర్మం నాలుగుకాళ్లమీద నడిచేదట. చేసిన ప్రతిదీ ధర్మమే అయినప్పుడు ఎందుకు నడవదు? ఆ రోజుల్లో రాక్షసం, పైశాచికం, ఆసురం మొదలైన వాటిని పెళ్లిళ్లుగానూ, గూఢోత్పన్నుడు, కానీనుడు మొదలైనవాళ్లు కొడుకులుగానూ జమ అయినారు. కాని కలియుగం కర్మంకాలి అవన్నీ అధర్మాలయినయ్. రాక్షసం అంటే ఎబ్డక్షన్ అన్నారు. పైశాచికం అంటే రేప్ అన్నారు. గూఢోత్పన్నుడు సర్టిఫికెట్టుకి వెళ్లినా కొడుకు చెలామణి కాడుగదా!"

"ధర్మశాస్త్రకారులే ధర్మదేవతకి కాళ్లు తెగ్గోశారంటారా?"

"సందేహం లేదు. చేసినవన్నీ ధర్మాలైనరోజున ధర్మదేవత నాలుగుకాళ్లమీద నడిచింది. అవన్నీ పనికిరావని కొట్టేస్తే ఒకే కాలు మిగిలింది. ఇప్పటికయినా మించిపోయిందిలేదు. నలుగురు సంస్కృత పండితుల్ని తీసుకుంటే, ధర్మదేవతని 44 కాళ్లమీద నడిపించవచ్చు."

"మీ నైతికపరాబులంతా ఇప్పుడు చేయిస్తున్నది అదేనా?"

"కాదు ఉన్నకాళ్లని కోసేస్తున్నాం. కాంగ్రెస్‌వాళ్ల దృష్టిలో ఇదివరకు ధర్మంగా కనిపించిన నాన్‌కోఆపరేషన్ ఇప్పుడు అధర్మమయింది. పరమ పాపిష్ఠి శాసనంగా కనిపించిన డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ ఇప్పుడు శాంతిరక్షణ చట్టాలుగానూ, ప్రివెంటివ్ డిటెన్షన్ ఆక్టుగానూ అవతరించినయ్. 1947 మార్చి 14వ తేదీ అర్ధరాత్రి 11 గంటల 59 నిమిషాల వరకూ దేశాభివృద్ధికి జాతీయసంస్కృతికీ, ముఖ్యమార్గంగా తోచిన భాషారాష్ట్ర నిర్మాణం, ఒక్క నిమిషంలో సకల జాతీయైక్యతకు వేరుపురుగయిపోయింది. కార్మికులకు, విద్యార్థులకు సమ్మె చేసే అధికారం పోయింది."

"అయితే ఫ్యాక్టరీలూ, స్కూళ్లు మూతబడాలంటారా?"

"ఏమి టయ్యా నువ్వుకూడా అట్లా మాట్లాడతావ్? రాత్రింబగళ్లు రెక్కలు విరుచుకున్నా కడుపునిండని కూలీలకూ, ఫస్ట్‌క్లాసులో పాసయినా ఉద్యోగం దొరకని విద్యార్థులకూ సమ్మెలు చేయటం సరదా అనుకున్నావా? ఇబ్బందుల్ని తొలగించుకోటానికి వాళ్లకి ఉన్న సాధనం అదొక్కటేగా? అసలు కుర్రాళ్లని మొదట స్కూళ్లు మానిపించింది కాంగ్రెస్ వాళ్లే తెలుసా?"

"ఇవన్నీ తెలిసే, మీరు ధర్మాన్ని అధర్మంగానూ, అవినీతిని నీతిగానూ, ముద్ర కొట్టటానికి ఎందుకు తయారయినారు?"

"ధన మూల మిదం జగత్,"

"మీ అసలు అభిప్రాయాలు అధికారులకి తెలియవా?"

"తెలుసు. అయితే యేం? డాక్టర్ చేత విషం పెట్టించటం, ఆడిటర్ చేత దొంగ పద్దులు రాయించడం, క్రిమినల్ ప్లీడర్ సలహాతో నేరాలు జరిపించడం, జరిగినట్లే అసలు విషయం తెలిసిన నాబోటివాడిచేత ముద్రవేయించటం మంచిదనుకున్నారు. అవసరాన్ని పట్టి వాటిని నిర్ణయించి, వాటిమీద డబ్బా వాయించమని నేను చెపుతూ ఉంటాను."

"విదేశాల్లో కూడా ఇంతేనా?"

"చాలా భారీఎత్తులో జరుగుతున్నది. అందుకనే ప్రజాస్వామ్యం, వ్యక్తిగత స్వేచ్ఛ, నియంతృత్వ ప్రతిఘటన, స్వేచ్ఛామానవుడి రక్షణ — అని ఎన్నో రంకెలు వినిపిస్తున్నయ్. మాది అసలు డాలర్ మార్కు ప్రజాస్వామ్యం అని చెప్పుకునే అమెరికా, ఆసియా దేశాలను కమ్యూనిస్టు నిరంకుశత్వంనుంచి కాపాడుతుందట కాని, మాడి చస్తున్న జనానికి ఒక గింజయినా ఇచ్చిన పాపాన పోదు. ఆసియా దేశాలకు స్వాతంత్ర్యం ఇప్పించటానికి ఆటంబాంబులనూ, సూపర్ ఫోర్ట్ బాంబర్లనూ పంపుతున్నది. శ్రేయోరాజ్యాన్ని స్థాపించానని చెప్పుకునే బ్రిటన్ సూయజ్ ప్రాంత శ్రేయస్సును మహా చక్కగా కాపాడుతున్నది. ఇండియా అప్పులక్రింద అడిగింది తప్ప ఏదయినా ఇస్తుందట. మలయా రబ్బరుతోటల యజమానులకు శ్రేయోరాజ్యాన్ని కట్టపెడుతున్నది."

"ముసోలిని అబిసీనియాకు నాగరికత ఇస్తానన్నట్లేనా, ఇది కూడా?"

"ముసోలినీ పాశ్చాత్యనాగరికత అన్నాడు. వీళ్లు ప్రజాస్వామ్యం అంటున్నారు. ఇటీవల క్యాథలిక్ చర్చికూడా రంగంలోకి దూకింది."

"మీ నైతికపరాబుల అవసరం ఎంతవరకూ ఉంటుంది?"

"జనంకళ్లల్లో కారం కొట్టటం అవసరమని అధికారులు భావించినంతవరకూ"

"దానికి ఎక్కువకాలం పట్టదేమో?"

"అందుకనే మేము దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుంటున్నాము. ఈ మధ్య మా సంపాదన మహా ముమ్మరంగా ఉంది."

"నిజం?"

"నీతో అబద్ధం చెపుతానా? నువ్వుకూడా నా మాట విని మాలో చేరు. విదేశాల్లో లెక్చర్లివ్వటానికి బయలుదేరు. ఆ దేశాల్లో భారతీయ ఆధ్యాత్మికఘనతను ప్రశంసించు. మనదేశంలో వాళ్ల ప్రజాస్వామ్యాన్ని ఆకాశానికి ఎత్తు. అప్పుడు నీకు కనకాభిషేకమే జరుగుతుంది...... సరే, సాహిత్య సేవక మంత్రిగారికి వ్యాసం రాసి పెట్టాలిట. మళ్ళీ కలుద్దాం" అంటూ బయటికి దారితీశాడు నైతికపరాబు. ★